నమస్తే తెలంగాణ

# రాజన్న సిరిసిల్ల

5 | కరీంనగర్, మంగళవారం 17 డిసెంబర్ 2024 | RAJANNA SIRCILLA

# ఏం చేశారని సంబురాలు ?

- అది ప్రగతి నివేదిక కాదు.. కాగితాల నివేదిక
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పక్కన బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 16 : నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారని ఏడాది సంబురాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ప్రశ్నించారు. అవి సంబురాలు కాదు సంవత్సరీకాలు చేస్తున్నట్టు ఉందని విమర్శించారు. ఇటీవల మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రగతి నివేదికను విడుదల చేశారని, అది కాగితాల నివేదిక అని ఎద్దేవా చేశారు. మానకొండూర్‌లో సోమవారం బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానకొండూర్ ఎమ్మెల్యే చేసింది శూన్యమని, నియోజక వర్గ ప్రగతి నివేదికలో ఉన్నవి ఏ ఒక్కటీ కూడా జరగలేదని విమర్శించారు. ఎమ్మెల్యే నిధుల నుంచి గానీ, సీఎం నిధుల నుంచి గానీ ఏమైనా నిధులు తీసుకొచ్చాడా..? అని ప్రశ్నించారు. నియోజక వర్గానికి వంద పడకల దవాఖాన తామే తీసుకొచ్చామని, కానీ ఇంకా ఎందుకు ప్రారంభించలేదన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన నుంచి ఏ ఒక్క కుల సంఘ భవనం గానీ, మహిళా భవనాలు గానీ నిర్మించారా..? అని అడిగారు. ఏడాది కాలంలో ఎక్కడా ఒక్క పని చేయలేదని ఎద్దేవా చేశారు. ఇసుక, మట్టి, కంకర మాఫియాలను తయారు చేశారే తప్ప చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఆనాడు సీఎం కేసీఆర్ గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు రోడ్డు వేసేందుకు ₹72 కోట్లతో ప్రొసీడింగ్ ఇచ్చారని, కానీ, ఏడాది గడుస్తున్నా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. తాము తెచ్చిన ప్రొసీడింగ్‌లు క్యాన్సల్ చేయడం తప్ప అభివృద్ధి చేయడం లేదన్నారు. నియోజక వర్గంలో ఇప్పటి వరకు 50 శాతం కూడా రుణమాఫీ కాలేదని, అందుకు బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఎమ్మెల్యేకు నియోజక వర్గ అభివృద్ధి మీద ఏ మాత్రం అవగాహన లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట మరోసారి ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, గడ్డం నాగరాజు, సిద్ధం వేణు తదితరులు ఉన్నారు.



మధ్యాహ్నం 2 గంటలకే మూసి ఉన్న అల్ట్రా సౌండ్ స్కానింగ్ విభాగం



నిరుపయోగంగా టుడీ ఈకో మిషన్

కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన దవాఖాన







జీజీహెచ్‌లో ఎక్స్‌రే రిపేర్‌తో మూసి ఉంచిన గది

- మిషన్ చెడిపోయి 15 రోజులకుపైనే..
- నిధులు లేక మరమ్మతులూ కరువే
- సర్కారు దవాఖానలో క్రమంగా నిలిచిపోతున్న వైద్య పరీక్షలు
- ఆరోగ్య మహిళా కేంద్రంలో తాత్కాలిక సేవలు
- వారంలో మూడు రోజులు అష్టకష్టాలు
- మధ్యాహ్నం 2 గంటలకే సీటీ స్కాన్ గదికి తాళం
- రేడియాలజిస్టులు లేక ఒక్కపూటకే సేవలు
- తెరుచుకోని 2డీ ఈకో గది
- వైద్యులు లేక నిలిచిన గుండె పరీక్షలు
- పేషెంట్ల అసంతృప్తి

# కరీంనగర్ జీజీహెచ్‌లో ఎక్స్‌రేకూ దిక్కులేదు!

కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖాన (జీజీహెచ్)లో వైద్య పరీక్షలు క్రమంగా నిలిచి పోతున్నాయి. ముఖ్యంగా వైద్యులు, సిబ్బంది లేక సేవలు కొరవడుతున్నాయి. దవాఖాన నిర్వహణకు కనీస నిధులు లేక పోవడంతో సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రమాదాల్లో గాయపడ్డ క్షతగాత్రులకు కనీసం ఎక్స్‌రే తీయించాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. మిషన్ చెడిపోయి పదిహేను రోజులవుతున్నా బాగు చేయించే దిక్కు లేకుండా పోయింది. ఏడాది కాలంగా మధ్యాహ్నం తర్వాత సీటీ స్కాన్ గదికి తాళం పడుతున్నా.. 2డీ ఇకో గది తెరుచుకోకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులకు సేవలందించే వైద్యులు, సదుపాయాలు లేక నిత్యం వరంగల్, హైదరాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానలకు రెఫర్ చేస్తున్నారు. అక్కడికి వెళ్లలేని స్థితిలో రోగులు ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించి రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని వాపోతున్నారు.



ఆరోగ్య మహిళ కోసం ఏర్పాటు చేసిన ఎక్స్‌రే గదిలో ప్రభుత్వ దవాఖాన పెషేంట్లకు ఎక్స్‌రే తీస్తున్న సిబ్బంది

కరీంనగర్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ)/విద్యానగర్ : ఉత్తర తెలంగాణకు గుండెకాయ లాంటి కరీంనగర్ ప్రభుత్వ జిల్లా దవాఖాన.. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధి నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి మారింది. కానీ, సేవల్లో మాత్రం రోజు రోజుకూ అధ్వానంగా మారుతున్నది. వైద్యం కోసం ఇక్కడికి వస్తున్న రోగులెందరికో నిరాశే మిగులుతున్నది. అత్యవసర సేవల కోసం వచ్చే వారికి కనీస భరోసా కరువవుతున్నది. వైద్యులు లేరనో.. సదుపాయాలు లేవనో.. వరంగల్ ఎంజీఎం, హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా దవాఖానలకు పంపిస్తున్నారు. ముఖ్యంగా రోడ్డు, ఇతర ప్రమాదాల్లో గాయపడి వస్తున్న క్షతగాత్రులకు ఇక్కడ ప్రాథమిక చికిత్స చేసి ఇతర దవాఖానలకు రెఫర్ చేస్తున్నారు. కనీసం ఇక్కడ ఎక్స్‌రే విభాగం కూడా పని చేయడం లేదు. 15 రోజుల కింద మిషన్ చెడిపోతే ఇప్పటి వరకు బాగు చేయించలేదు. ప్రస్తుతం ఇదే దవాఖాన ఆవరణలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రంలోని ఎక్స్‌రేను తాత్కాలికంగా వినియోగించుకుంటున్నారు. ప్రతి మంగళ, బుధ, శుక్రవారాల్లో మహిళలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ మూడు రోజులు సాధారణ దెబ్బలతో వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ 180 నుంచి 200 మందికి ఇక్కడ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య మహిళా కేంద్రంలోనూ సరిపడా సిబ్బంది లేక పని భారం పెరుగుతున్నది. ఎక్స్‌రే మిషన్‌ను బాగు చేసేందుకు నిధులు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొన్నది. దీంతో ఆరోగ్య మహిళా కేంద్రంలోని ఎక్సరే మిషన్‌పై ఓవర్ బర్డెన్ పడుతున్నది. పరిస్థితి ఇలాగే ఉంటే ఇది కూడా చెడిపోయే ప్రమాదం ఉన్నది.

## సీటీ స్కాన్ ఒక్క షిఫ్ట్‌కే పరిమితం

దవాఖానలో మరో కీలకమైన విభాగంలోనూ రేడియాలజిస్టులు, టెక్నీషియన్లు లేక ఒక్క షిఫ్ట్‌లోనే సేవలు అందిస్తున్నారు. నిజానికి 24/7 సేవలందించేందుకు మూడు షిఫ్టుల్లో సీటీ స్కాన్ విభాగంలో సిబ్బంది పని చేయాలి. కానీ, ఇద్దరు మాత్రమే ఉన్నారు. దాంతో మధ్యాహ్నం 2 గంటల వరకే సీటీ స్కాన్ గది తెరిచి ఉంటున్నది. ఆ తర్వాత తాళమే కనిపిస్తుండడంతో రోగులకు నిరాశే ఎదురవుతున్నది. అత్యవసరంగా సీటీ స్కాన్ సేవల కోసం వచ్చే వారిని ప్రైవేట్‌కు వెళ్లాలని చెప్పలేక వరంగల్, హైదరాబాద్‌కో రెఫర్ చేస్తున్నారు. ఏడాది కాలంగా సీటీ స్కాన్ విభాగంలో ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు.




మధ్యాహ్నం 2 గంటల తర్వాత మూసి ఉన్న సీటీ స్కాన్ గది

## ఒక చోట ఉంటే మరో చోట లేదు

ఆరోగ్య మహిళా కేంద్రానికి సంబంధించిన వైద్య పరీక్షలకు తెలంగాణ రేడియాలజీ హబ్‌లో ఏర్పాటు చేశారు. అందులో విలువైన మిషన్ల నిర్వహణకే వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేరు. కేవలం మహిళల ఆరోగ్యాన్ని పరీక్షించేందుకు ఈ కేంద్రంలో ఏర్పాటు చేసిన మిషన్లను తీసుకెళ్లి ప్రధాన దవాఖానలో పెడుతున్నారు. ప్రతి మంగళ, బుధ, శుక్రవారాల్లో మహిళలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు చేసేందుకు తెచ్చిన అల్ట్రాసౌండ్ మిషన్‌ను ప్రధాన దవాఖానలో ఏర్పాటు చేశారు. ఆరోగ్య మహిళా కేంద్రంలో కేవలం మహిళా వైద్యులు, సిబ్బంది మాత్రమే ఉండి సేవలు అందించాలి. కానీ, అల్ట్రా సౌండ్ పరీక్షల కోసం వచ్చే మహిళలకు ప్రధాన దవాఖానలో అందరితో కలిపి నిర్వహిస్తున్నారు.

## నిధులు లేకనే సేవలు నిర్వీర్యం

ప్రతి రోజూ వెయ్యి నుంచి 1200 మంది రోగులు వచ్చే ఈ దవాఖానలో వైద్య విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించుకునేందుకు విస్తృతమైన అవకాశాలున్నాయి. కానీ, వైద్య సేవలే అందనప్పుడు రోగులు ఎలా వస్తారనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. దవాఖాన నిర్వహణ కోసం కనీస నిధులు లేక పోవడంతోనే పరీక్షలు నిర్వహించే యంత్రాలు క్రమంగా మూలన పడుతున్నట్టు తెలుస్తున్నది. వీటిని రిపేర్ చేయించే స్థితిలో కూడా జిల్లా దవాఖాన అధికారులు లేకపోవడం శోచనీయం. రేడియాలజీ విభాగంలో సరిపడా టెక్నీషియన్లు కూడా లేక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సీటీ స్కాన్, 2డీ ఈకో వంటి విభాగాల్లో సిబ్బందిని నియమించాల్సిన అవసరమున్నది. ప్రైవేట్ దవాఖానల్లో ఇలాంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే వేలకు వేలు ఖర్చవుతుంది. ఇంత పెద్ద మొత్తంలో చెల్లించే పరిస్థితి లేని వారే ఇక్కడికి వస్తున్నారు. అలాంటి వారికి ఇక్కడ నిరాశే మిగులుతున్నది.



## సేవలు ఒక చోట.. ఎక్స్‌రేలు మరోచోట

.. ఇతడి పేరు జీవన్ వర్మ. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆయన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఎడమకాలు ఫ్రాక్చర్ అయ్యింది. ఆయనకు ఎక్స్‌రే తీసేందుకు ఆరోగ్య మహిళా కేంద్రంలోని హబ్‌కు తీసుకెళ్లాల్సి వస్తున్నది. ఇతర పరీక్షలకు దవాఖానకు రావాల్సిందే. అటూ ఇటూ తిప్పడానికే తమకు సమయం సరిపోతోందని జీవన్ కుటుంబ సభ్యులు, స్నేహితులు చెబుతున్నారు. దవాఖాన ఒక చోట ఉంటే పరీక్షలకు మరోచోటికి వెళ్లాల్సి వస్తున్నదని వాపోతున్నారు. జీవన్‌లా రోజుకు పదుల సంఖ్యలో క్షతగాత్రులు ఇబ్బందులు పడుతున్నారు. మరీ ఎక్కువ గాయాలతో వస్తున్న వారికి ఎలాంటి పరీక్షలు నిర్వహించే ప్రయత్నం చేయకుండా వరంగల్, హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారు.

# తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బ తీస్తరా..?

- విగ్రహాల రూపురేఖలు మార్చినంత మాత్రాన ఉద్యమ చరిత్రను మార్చలేరు
- పేర్లు, రూపాలను తొలగించడంపైనే సీఎం రేవంత్ నజర్
- రామగిరి గడ్డపై త్వరలో తెలంగాణ వీరవనిత విగ్రహం
- ఎమ్మెల్సీ కవిత చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తాం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

రామగిరి, డిసెంబర్ 16: 'నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తున్నది. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది.' అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజమెత్తారు. విగ్రహాల రూపురేఖలు మార్చినంత మాత్రాన ఉద్యమ చరిత్రను మార్చలేరని స్పష్టం చేశారు. రామగిరి మండలం సెంటినరీకాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మలిదశ ఉద్యమాన్ని ముందుకు నడిపించిన గడ్డ రామగిరి గడ్డ అని, ఇక్కడి తెలంగాణ చౌక్ నుంచే సింగరేణి కార్మికులు ఉద్యమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఎప్పుడు జేఏసీ పిలుపునిచ్చినా..? రామగిరి గడ్డ మీద నుంచే ఈ ప్రాంతంలో తెలంగాణ వాదాన్ని వినిపించారన్నారు. లేకలేక అధికారంలోకి వచ్చిన పిచ్చి ఆనందంలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని, ప్రజా పాలనపై దృష్టి పెట్టకుండా పేర్లు, రూపాలను మార్చడంపైనే దృష్టి పెడుతున్నారని విమర్శించారు. ఎవరైనా గొప్పగా ఉండాలని ఆలోచన చేస్తారని, కానీ పాత పద్ధతి అంటూ తల్లిని కూడా అలాగే చూపించడం సీఎంకే సాధ్యమైందని దుయ్యబట్టారు. ఆనాడు మలిదశ ఉద్యమాన్ని ముందుకు నడిపించిన రామగిరి గడ్డపై త్వరలోనే తెలంగాణ వీర వనిత విగ్రహ ఆవిష్కరణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. అధికారంలోకి రాకముందు ఒక తీరు, వచ్చాక మరో తీరుగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని చెప్పారు. సింగరేణి కార్మికులను సైతం మోసం చేసిందని, వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రామగిరిలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణకు సింగరేణి కార్మికులు, పార్టీ కార్యకర్తలు, తెలంగాణ ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

# చలి @ 7.3 డిగ్రీలు

పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు



మల్లాపూర్: రాఘవపేటలో చలి మంట కాగుతున్న గ్రామస్తులు

జగిత్యాల టౌన్, డిసెంబర్ 16 : చలి తీవ్రత పెరుగుతున్నది. రోజురోజుకూ మరింతగా భయపెడుతున్నది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల వరకు నమోదవుతుండగా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. సోమవారం మల్లాపూర్ మండలం రాఘవపేటలో ఏకంగా 7.3 డిగ్రీలు నమోదయ్యాయి. ఈ విషయాన్ని పొలాస వాతావరణం కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గడంతో జనాలు వణికిపోతున్నారు. పొద్దంతా చల్లని గాలులతో ఇబ్బంది పడుతున్నారు.

# 28 తులాల బంగారు నగలు చోరీ

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 16 : ఓ మహిళ బ్యాగులోంచి 28 తులాల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. జగిత్యాల టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపెల్లికి చెందిన మిట్టపెల్లి రవీందర్‌రెడ్డి-జలజ దంపతులు బ్యాంకు లాకర్‌లో బంగారం పెట్టేందుకు సోమవారం బైక్‌పై తక్కళ్లపెల్లి నుంచి జగిత్యాలకు వచ్చారు. స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద ఉన్న ఓ బ్యాంకులోని తమ లాకర్‌లో ఆభరణాలు పెట్టేందుకు ప్రయత్నించారు. అయితే వారి బాక్స్ లాకర్ సైజు కంటే పెద్దగా ఉండడంతో ఇంటి నుంచి మరో చిన్న సైజు బాక్స్ తెచ్చేందుకని బయటికి వచ్చారు. అయితే, రవీందర్‌రెడ్డికి జగిత్యాలలో పని ఉండడంతో బంగారు నగలను భార్యకు ఇచ్చి ఆమెను పాత బస్టాండ్ వద్ద తక్కళ్లపెల్లి వెళ్లే బస్సు ఎక్కించి తను పనికోసం వెళ్లాడు. తక్కళ్లపెల్లిలో బస్సు దిగిన తర్వాత జలజకు బ్యాగులో నగలు కనిపించకపోవడంతో ఆందోళన చెందింది. వెంటనే ఈ విషయాన్ని తన భర్తకు ఫోన్ ద్వారా చెప్పింది. జగిత్యాల పాత బస్టాండ్ వద్ద బస్సులో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లుగా నిర్ధారణకు వచ్చారు. బాధితుడు రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

# ఆది నోరు విప్పాలి.. నిజాలు చెప్పాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

- కోడెల అక్రమ తరలింపువ్యవహారంపై మౌనం అంగీకారమేనా..?
- సీఎం పర్యటనలో ఒక్క ప్లేటుకే ₹32వేల బిల్లా..?
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ధ్వజం

వేములవాడ, డిసెంబర్ 16: 'విప్ ఆది శ్రీనివాస్‌కు ఫొటోలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై, భక్తుల మనోభావాలపై లేదు' అని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు మండిపడ్డారు. రాజన్న కోడెలు కోతకు వెళ్లిన వ్యవహారంలో ఆయన మౌనం తప్పునకు అంగీకారమేనా.. అని ప్రశ్నించారు. గతంలో రైతులకు ఇచ్చామన్న 1,734 కోడెలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని, ఇప్పటికైనా ఆయన నోరు విప్పాలని, నిజానిజాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. వేములవాడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి చిన్న విషయానికి సమావేశాలు పెట్టి ప్రతిపక్షాలను విమర్శించే ఆది శ్రీనివాస్, రాజన్న కోడెలు కబేళాలకు తరలిస్తున్నా, సాక్షాత్తూ మంత్రి కొండా సురేఖ అనుచరులకు కట్టబెట్టిన తీరు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారినా ఎందుకు మాట్లాడడం లేదో చెప్పాలన్నారు. వరంగల్ జిల్లా గీసుకొండ పరిధిలోని ముగ్గురికి 33మంది రైతుల పేరిట పంపిణీ చేసిన 66 కోడెల వ్యవహారంపై బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. 66 కోడెలలో 28 జీవాలను కబేళాలకు అమ్మడం చాలా బాధాకరమన్నారు. అక్కడి నుంచి 26 కోడెలను తిరిగి రాజన్న గోశాలకు తీసుకువచ్చారని, ఈ విషయాన్ని ఆలయ అధికారులు గోప్యంగా ఉంచడం అనేక సందేహాలకు తావిస్తున్నదన్నారు. ఈ వ్యవహారంలో పోలీసులు నిందితులను జైలుకు పంపినా, దీనిపై శ్రీనివాస్ నోరుమెదపక పోవడం చూస్తుంటే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. రాజన్న ఆలయానికి సాలినా ఏటా రూ.119 కోట్ల ఆదాయం వస్తున్నా, అందులో కోడె మొక్కుల నుంచే రూ.22కోట్లు సమకూరుతున్నా కోడెల సంరక్షణకు ఏడాదికి రూ.2కోట్లు మాత్రమే వెచ్చించడం బాధాకరమన్నారు. ఈ రైతులకు పంపిణీ చేసిన కోడెల జాబితాను పోలీసులకు అందజేసి కేసు పెడతామని చెప్పిన ఆలయ ఈవో, ఇప్పటి వరకు ఎందుకు ఫిర్యాదు చేయలేదో చెప్పాలన్నారు. రాజకీయ ఒత్తిడి తట్టుకోలేకనే ఆయన సెలవులో వెళ్లారని ఆరోపించారు. ఆలయ పాలన గాడి తప్పిందని, భక్తులకు సంపూర్ణ సేవలందడం లేదని మండిపడ్డారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సీఎం వేములవాడ పర్యటన సందర్భంగా వంద మంది వీఐపీల భోజనాలకు ₹32లక్షలు బిల్లు చేశారని, అంటే ఒక్కో ప్లేటుకు ₹32 వేలు ఖర్చు చేయడం ఎక్కడా చూడలేదన్నారు. గతంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు వచ్చినా ఇంత మొత్తంలో ఖర్చుకాలేదన్న ఆయన, సదరు బిల్లులతోపాటు ఇతర ఖర్చులు మొత్తం ₹2కోట్లను రాజన్న ఆలయం నుంచి చెల్లింపులు చేయాలని చెప్పడం సరికాదన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధికోసం ₹72 కోట్లు తెచ్చామని అంటున్నారని, అందులో ఒక్క రూపాయి అయినా డిపాజిట్ అయిందా అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేశ్, నరాల శేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు గోస్కుల రవి, నాయకులు పొలాస నరేందర్, తీగల రవీందర్‌గౌడ్, వెంగల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



కుటుంబ సభ్యులతో కలిసి జగిత్యాల ప్రజావాణికి వచ్చిన బాధితుడు నక్క లక్ష్మణ్

# ఫోన్ నంబర్ లింక్ చేసి.. ₹18 లక్షలు కాజేసి

- ఏడేళ్లుగా ఓ యువకుడి నిర్వాకం
- రిటైర్డ్ ఉద్యోగి ఖాతా నుంచి నెలకు ₹20 వేలు విత్‌డ్రా
- వైద్య ఖర్చుల నగదు కోసం బ్యాంకు వెళ్లిన భార్య
- స్టేట్‌మెంట్ తీయడంతో బయటపడ్డ బాగోతం

జగిత్యాల రూరల్, డిసెంబర్ 16 : ఎస్సారెస్పీ రిటైర్డ్ ఉద్యోగి ఖాతాకు తన ఫోన్ నంబర్ లింక్ చేసి ఓ యువకుడు నెలకు ₹20 వేల చొప్పున విత్‌డ్రా చేసుకుంటూ ఏకంగా ₹18 లక్షలు కాజేశాడు. వైద్య ఖర్చులకు డబ్బుల అవసరం కోసం బ్యాంకుకు వెళ్లిన కుటుంబ సభ్యులు స్టేట్‌మెంట్ తీయడంతో బాగోతం బయటపడింది. దీంతో తమకు న్యాయం చేయాలని ఆ వృద్ధుడి కుటుంబ సభ్యులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. జగిత్యాల గాంధీనగర్‌కు చెందిన నక్క లక్ష్మణ్ రిటైర్డ్ ఎస్సారెస్పీ ఉద్యోగి. ఆయనకు నెలకు ₹48వేల పింఛన్ వస్తున్నది. ఈ విషయం లక్ష్మణ్‌కు తెలియదు. ఇది గమనించిన అదే కాలనీకి చెందిన యువకుడు దీకొండ తిరుపతి లక్ష్మణ్ బ్యాంక్ అకౌంట్‌కు తన ఫోన్ నంబర్ యాడ్ చేసుకున్నాడు. ప్రతి నెలా ₹20 వేల చొప్పున ఫోన్‌పే ద్వారా తీసుకున్నాడు. ఇలా ఏడేండ్లలో ₹18 లక్షలు డ్రా చేశాడు. ఇటీవల నర్సయ్యకు కాలు విరిగితే చికిత్స కోసం డబ్బులు అవసరం కాగా, ఆయన భార్య బ్యాంకుకు వెళ్లింది. అకౌంట్‌లో డబ్బులు తక్కువగా ఉన్నాయని సిబ్బంది చెప్పడంతో స్టేట్‌మెంట్ తీసుకున్నది. దీంతో తిరుపతి వ్యవహారం బయటపడింది. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. తిరుపతి ఆరు నెలల్లో ఇస్తానని ఒప్పుకొన్నాడు. అయినా, ఇవ్వకపోవడంతో లక్ష్మణ్ కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.